క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు



రిలే దీక్షలు నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు

జంగారెడ్డిగూడెం: కార్మికుల డిమాండ్లపై ఆర్టీసీ యాజమాన్యం తక్షణం స్పందించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కేవీ రావు, ఎన్ఎం కుమార్, బీవీఎస్ఎన్టీ రాజు, తదితరులు మాట్లాడుతూ కార్మికులు పేర్కొన్న 38 డిమాండ్లపై యాజమాన్యం స్పందించని కారణంగా నాల్గో దశ నిరసన కార్యక్రమంలో భాగంగా సోమ, మంగళ వారాల్లో రెండు రోజులు రిలే దీక్షలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తొలి రోజు నిరాహార దీక్ష చేపట్టామన్నారు. కార్యక్రమంలో వీసీహెచ్ రావు, ఎన్ఎస్ కుమార్, ఎస్ఎస్ నారాయణ, వైఎం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల ప్రారంభం



విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: గవరవరం (వెంకయ్యపాలెం) రామాలయంలో నూతనంగా ప్రతిష్ఠిస్తున్న శ్రీపట్టాభి సీతారామ లక్ష్మణ ఆంజనేయ సహిత గణపతి ధ్వజ త్రయాహినిక ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి ఆనంద శివచార్యుల పర్యవేక్షణలో గణపతి పూజ, సాలా ప్రవేశం, ప్రదక్షణ భూత బలి, పుణ్యాహవచనా పంచగవ్య స్థాపన వంటి ప్రత్యేక పూజారి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠా విగ్రహాలకు క్షీరాధివాసం చేయగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అభిషేకాలు చేశారు. 29వ తేదీ లక్ష్మి గణపతి నవగ్రహ రుద్ర వాస్తు విష్ణు లక్ష్మీ హోమం, 30వ తేదీ ప్రత్యేక పూజలు నిర్వహించి అదే రోజు విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు.

మే 2న మన్యం బంద్



మాట్లాడుతున్న తెల్లం రామకృష్ణ

బుట్టాయగూడెం: ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరుతూ మే 2వ తేదీన మన్యం బంద్ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ తెలిపారు. మండలంలోని పడమర రేగులకుంటలో ఆ సంఘ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో గిరిజనులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. జీఓ నంబర్ 3 రద్దు కావడంతో గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలను గిరిజనులతో భర్తీ చేసేందుకు కృషి చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. సమావేశంలో సంఘ నాయకులు పోలోజు నాగేశ్వరరావు, వెట్టి వీరయ్య, నూకా భద్రం, తెల్లం ప్రసాద్, కుంజా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సిల్టు తొలగించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: రాజీవ్‌నగర్ కాలనీ ఎస్సీ దళితపేట డ్రెయినేజీ దుర్గంధంతో నిండిపోయింది. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారని డ్రెయినేజీలో పేరుకుపోయిన తొలగించాలంటూ కేవీపీఎస్, అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కుంజా జ్యోతికి ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ బుట్టాయగూడెం పంచాయతీ షాపింగ్‌లో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారం వ్యర్థాలు డ్రెయినేజీలో పోస్తున్నారని అవి అక్కడి నుంచి ఎస్సీ కాలనీ వరకూ కొట్టుకు రావడంతో దుర్గంధం వెదజల్లుతుందన్నారు. పంచాయతీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారంను తొలగించాలని వ్యర్థాల వలన డ్రైనేజీ పక్కన ఉన్న వాటిని శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో దారా శిఖామణి, ఎ.ఏసుపాదం, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

- వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి
- డెంగీ, మలేరియాపై అప్రమత్తత అవసరం
- కొబ్బరి నీళ్లు, పుచ్చకాయ, తాటిముంజెలతో ఉపశమనం
- అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచన



ద్వారకాతిరుమల: ప్రజలకు వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి

ద్వారకాతిరుమల: ప్రజలు ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గుణ్ణంపల్లి గ్రామంలో వేసవి ఎండలు కారణంగా కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధిక వేడి కారణంగా శరీరంలోని నీరు చమట రూపంలో బయటకు పోయి, వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కాబట్టి ప్రజలు వీలైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల లోపు పనులను ముగించుకోవాలన్నారు. తిరిగి సాయంత్రం 4 గంటల తరువాత పని చేసుకోవాలన్నారు. అలాగే కాటన్ దుస్తులు ధరించాలని, తలపాగా, టోపీ, కళ్లద్దాలు పెట్టుకోవాలని, ఎక్కువగా ద్రవ పదార్థాలైన కొబ్బరి నీళ్లు, గ్లూకోజ్ వాటర్, షర్బత్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలన్నారు. దూర ప్రయాణాలు మానుకోవాలని, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

అదేవిధంగా పల్లపు ప్రాంతాల్లో అక్కడక్కడ మలేరియా, డెంగు తదితరులు జ్వరాలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి, ప్రజలు వారానికి ఒకసారి మంచి నీటి నిల్వ ప్రాంతాలైన తొట్టెలు, డ్రమ్ములు, నీళ్ల ట్యాంకులు, పూల కుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. సాయంత్రం సమయములో కిటికీలు వేసి, దోమ తెరలు వాడాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనూ, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లోనూ, డెంగ్యూ, మలేరియా పరీక్షలు ఉచితంగా చేస్తారని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఏఎన్ఎం లలితకుమారి, హెల్త్ అసిస్టెంట్‌లు మేక శ్రీనివాస్, సురేష్, ఆశా కార్యకర్తలు సీత, కమల, రాణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి నీళ్లతో ఉపశమనం

బుట్టాయగూడెం: గత కొద్దిరోజులుగా ఎండలు మండిపోతున్నాయి. సుమారు 35 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న వేసవి తాపం నుంచి ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సూర్యతాపం నుంచి ఉపశమనం పొందాలంటే శరీరంలో ఉండే వేడిని తగ్గించుకోవాలి. దీని కోసం ప్రజలు రకరకాల ఉపశమనం పొందే మార్గాలను చూసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవిలో లభించే పుచ్చకాయలు, తాటిముంజెలతో పాటు కొబ్బరి నీరు మంచి ఆరోగ్యంగా భావిస్తున్నారు. శరీరానికి వేసవి నుంచి ఉపశమనం ఇచ్చే కొబ్బరి నీళ్ల రుచికి వగరుగా ఉన్నా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తాయి. ఉదయం 8 గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో బయటకు వచ్చి తిరిగే వారు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు శీతల పానీయాలు సేవించే కన్నా కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటి పానీయాలు తీసుకోవడం మేలని వైద్యులు సూచిస్తున్నారు.



బుట్టాయగూడెం: కొబ్బరి బొండాలను విక్రయిస్తున్న వ్యాపారి

జోరుగా కొబ్బరి బొండాల వ్యాపారం

సహజ సిద్ధంగా లభించే కొబ్బరి నీళ్లలో ఔషధ గుణాలు అధికంగా ఉంటాయి. ఎండాకాలంలో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు కొబ్బరి నీళ్లు తాగుతుంటారు. శీతల పానీయాల కంటే కొబ్బరి నీళ్లకు డిమాండ్ అధికంగా ఉంటుంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో కొబ్బరి బొండాల వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. బొండాలను రూ.25 నుంచి రూ.40 వరకూ విక్రయిస్తున్నారు. అలాగే ఒక బాటిల్ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. వేసవి సీజన్‌లో కొబ్బరి బొండాల విక్రయాలు ఎక్కువగా సాగుతాయి. అలాగే కొబ్బరి బొండాల వ్యాపారులు సైకిళ్లు, బళ్ల రిక్షాలపై విక్రయిస్తున్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఓ వ్యక్తి మృతిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతవరం గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటేశ్వరరావు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. ఇతడికి పిట్స్‌తో పాటు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఈ నెల 27వ తేదీ రాత్రి గేదె దూడకు అనారోగ్యంగా ఉందని ఇంటి నుంచి పొలానికి వెళ్లాడు. ఉదయం అయినా రాకపోయే సరికి వెంకటేశ్వరరావు తమ్ముడు పొలానికి వెళ్లి చూడగా, వెంకటేశ్వరరావు స్పృహ తప్పి పడి ఉండటాన్ని గమనించాడు. మృతుడిని జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

పోలవరం రూరల్: పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస బాబు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ఎక్సైజ్ దాడులు



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం దాడులు నిర్వహించామని సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో నాటుసారా పాత కేసుల్లో పరారీలో ఉన్న నిందితులు వింజరం గ్రామానికి చెందిన బాసబోయిన సత్యవతి, జీలుగుమిల్లి మండలం కామయ్యపాలేనికి చెందిన సిరిబత్తుల రామారావు, కొప్పుల గంగాదర్ గౌడ్‌లను అదుపులోకి తీసుకుని జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. మేజిస్ట్రేట్ వీరికి రిమాండ్ విధించారన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు భూమి పూజ



బుట్టాయగూడెం: గ్రామ శివారు కుమ్మరిగట్టు వద్ద ఉన్న విజయ గణపతి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 30వ తేదీన శ్రీరమా సహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు కొండేపాటి రామకృష్ణ, పెనుగుర్తి సోంబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భూమి పూజ ఉదయం 10:16 నిముషాలకు నిర్వహిస్తామన్నారు. 11 గంటలకు మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశపు హాల్‌లో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కాగా పలు వార్డుల్లో సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిలర్ చిటికెల అచ్చిరాజు మాట్లాడుతూ అజెండాలో పెట్టిన శ్రీనివాసపురం రోడ్డు అభివృద్ధి చేయాల్సి ఉందని, రోడ్డు నిర్మాణానికి 1.40 కోట్ల రూపాయలు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, పీఎస్ఎన్ చంద్రరావు, తదితరులు మాట్లాడుతూ గతంలో ఆయా వార్డుల్లో పెట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్యం సరిగా లేదని, డ్రెయిన్లలో పూడిక తీయాలని కోరారు. దీనిపై కమిషనర్ కేవీ రమణ మాట్లాడుతూ డ్రెయిన్ల పూడిక తీత పనులు చేపట్టామని, మే నెలాఖరునాటికి అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే స్ట్రీట్ లైట్లు కొత్తవి వచ్చాయని, అన్ని వీధుల్లో లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యర్థ జలాలు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా అజెండాలో పేర్కొన్న పలు అభివృద్ధి పనులకు సమావేశం ఆమోదం తెలిపింది.

చలో ఏలూరు విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

లింగపాలెం: చలో ఏలూరు దళిత సేన సింహగర్జన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జవరపు రవి ప్రకాష్ పిలుపునిచ్చారు. మండలంలోని శింగగూడెంలో ఏలూరు జిల్లా దళిత సేన ముఖ్య నాయకుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయబద్ధమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మే 5వ తేదీ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల వారు సాగు చేసుకునే సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ధర్నాకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత సేన ఏలూరు జిల్లా దళిత సేన వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్, పింగుల ఇదియా, లక్కపాము దాసు, పింగుల నాగేశ్వరరావు, కాకాని యోహాను, పంతం కిషోర్, తాళ్లూరి రాజారావు, కొప్పుల నాగేందర్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు విజయరాజు పరామర్శ



సత్యనారాయణరెడ్డిని పరామర్శిస్తున్న కంభం విజయరాజు

చింతలపూడి: మండలంలోని వెలగలపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణరెడ్డిని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంభం విజయరాజు పరామర్శించారు. సోమవారం సత్యనారాయణరెడ్డి సతీమణి ప్రసన్న లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న విజయరాజు ప్రసన్న లక్ష్మి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కామవరపుకోట: కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. సోమవారం మండలంలో రామన్నపాలెం గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో రాయంకుల సత్యనారాయణ, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, గుత్రాల రవికుమార్, వెర్రి శ్రీను, కొమ్మిన నరేష్ పాల్గొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



అరుదైన వ్యాధితో బాధపడుతున్న కంచర్ల జోత్స్న

కొయ్యలగూడెం: అరుదైన వ్యాధి సోకడంతో ఆడుతూ పాడుతూ తిరిగే చిన్నారి పాలిట శాపంగా పరిణమించింది. లక్షల రూపాయల చికిత్సను అందించలేక బాలిక తల్లి దండ్రులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే కిరాణా కొట్టులో పని చేసే కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కంచర్ల రాజేష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె జ్యోత్స్న (7) ప్రాథమిక పాఠశాల విద్యను అభ్యసిస్తుండగా ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కాకినాడ హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. పలు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు అరుదైన వ్యాధి సోకిందని, ప్లాస్మా థెరపీ చేయాలని, లక్షల రూపాయల ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో రాజేష్ ఉన్నదంతా అమ్ముకొని కుమార్తెకు చికిత్స ప్రారంభించగా బాలిక ఆరోగ్యం కొంత వరకు కుదుట పడిందన్నారు. అయితే ఇంకా పది, పన్నెండు లక్షల రూపాయల వరకు ఖర్చు పెట్టాల్సి ఉందని వైద్యులు అనడంతో దిక్కుతోచని స్థితిలో రాజేష్ గడుపుతున్నాడు. స్వచ్ఛంద సంస్థలు తలో కాస్త ఆర్థిక సహాయం అందిస్తున్నప్పటికీ ఏ రోజుకు ఆ రోజు చికిత్సకు సరిపోతుందంటున్నాడు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, దాతలు స్పందించి తన కుమార్తెకు మెరుగైన చికిత్సను అందించడానికి సాయం చేసి ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్నాడు. దాతలు ముందుకు వచ్చి 80993 95040 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నాడు.

పీజీఆర్ఎస్‌కు పలు దరఖాస్తులు

జంగారెడ్డిగూడెం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఎంవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలపై వినతులు సమర్పించారు. గొలిమే బాల ఏసు పంగిడిగూడెం గ్రామంలో భూములను బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించి పాస్‌పుస్తకాలను మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. బొడ్డు రాంబాబు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆటోస్టాండ్ వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు. బి.రాంబాబు, మరికొందరు జంగారెడ్డిగూడెంలో 28వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని, వడ్లమూడి వెంకాయమ్మ తనకు కొయ్యలగూడెం మండలం రామానుజపురం గ్రామంలో 2.27 సెంట్ల భూమి ఉందని, భూమిలోకి వెళ్లడానికి పుంతదారి ఆక్రమించారని, సర్వే చేసి దారి చూపించాలని దరఖాస్తు చేశారు. అలాగే, జీలుగుమిల్లి మండలం టేకూరు కాలనీకి చెందిన బడిగంటి కుమార్‌రెడ్డి టేకూరు కాలనీ పక్కన ఆర్ఎస్ నెంబర్ 143లో ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఎం.రమేష్ పొగాకు బ్యారన్ నిర్మించారని, చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను ఆయాశాఖల అధికారులకు ఎండార్స్ చేశామని తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరాల ఏర్పాటు



కొయ్యలగూడెం: వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సేవా సంస్థ అధ్యక్షుడు



జంగారెడ్డిగూడెం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పొందాలని గ్రంథాలయాధికారి పి.దుర్గారావు అన్నారు. జంగారెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రతిభ కోచింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ సీఎం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పుస్తక పఠనం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: శాఖ గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని చిన్నారులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు పేర్కొన్నారు. గ్రంథాలయ పని దినాలలో ఉదయం 8 గంటల నుంచి ప్రతిరోజూ శిక్షణ శిబిరం నిర్వహిస్తామని జూన్ 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మేధో శక్తిని, సృజనాత్మకతను పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆర్గనైజర్ ఎస్‌బీజీ శేఖర్ తెలిపారు. పోటీలు నిర్వహించి చివరి రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని నాగేశ్వరరావు పేర్కొన్నారు.

పోలవరంలో..

పోలవరం రూరల్: పోలవరం శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిక్షణా తరగతులు (సమ్మర్ క్యాంప్) సోమవారం ప్రారంభించారు. జూన్ 6వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి జె.సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

డొక్కా సీతమ్మ తెలుగు వారికి గర్వ కారణం



కొయ్యలగూడెం: వృద్ధాశ్రమంలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దాతలు



కామవరపుకోట: వృద్ధులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నేతలు

కొయ్యలగూడెం: ఆంధ్రుల అన్నపూర్ణమ్మగా ఖ్యాతి గాంచిన డొక్కా సీతమ్మ తెలుగు వారికి గర్వ కారణంగా నిలిచారని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ చొడిపిండి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం రోడ్‌లోని రోటరీ క్లబ్ వృద్ధాశ్రమంలో సోమవారం డొక్కా సీతమ్మ వర్ధంతి కార్యక్రమం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పౌష్టికాహారాన్ని, అన్న సమాధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ ఆర్గనైజర్ మాజేటి అప్పలరాజు, మాజేటి సత్యనారాయణ, దారం సత్యరాజు, యాతం సత్యనారాయణ, సంకు మధు, తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మకు ఘన నివాళి

కామవరపుకోట: మండలంలో వై.కాలనీ అల్లూరి సీతారామరాజునగర్‌లో యువజన సంఘ ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వృద్ధులకు భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆకలి అన్నవారికి డొక్కా సీతమ్మ కడుపు నింపే ప్రయత్నం చేసి ఆంధ్రుల అన్నపూర్ణగా వెలుగొందారని ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో యావన్నంది నాగరాజు, కోడూరి చైతన్య, మణికంఠ, వీరమల్ల మధు, తమ్మినేని శ్రీను, బట్టా సుబ్బు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి



చింతలపూడి: మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



కొయ్యలగూడెం: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు

చింతలపూడి: దేశంలో కార్మిక సమస్యలపై, హక్కులపై కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు, పెట్టుబడిదారుల దాడులు ఎక్కువయ్యాయని సీఐటీయూ మండల అధ్యక్షుడు నత్త వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న సమ్మె హక్కు, ఎనిమిది గంటల పని దినాలు నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. అనంతరం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్‌వీఎస్ నారాయణ, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎస్.సరోజిని, ప్రగడవరం సెక్టార్ నాయకురాలు ఒ.కవిత, వెంకమ్మ, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కొయ్యలగూడెం: కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఉన్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మెయిన్ సెంటర్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మేడే స్ఫూర్తితో రైస్‌మిల్లు హమాలీ కార్మికుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అశోక్, పి.వెంకటేష్, పత్తి రాజేష్, వీర్రాజు, షేక్ హుస్సేన్, కె.పెంటయ్య, షేక్ బాషా, కె.సీతారాం, రాములు, దుర్గారావు, నాని పాల్గొన్నారు.